

# మనసెరిగిన వైద్యుడు

**జంపాల చౌదరి.. అమెరికాలో ఈ పేరు తెలియని తెలుగువాడుండడు. ఆ మాటకొస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ పేరు ఎందరికో పరిచయం. కొందరికాయన మనసు చదివి చికిత్స చేసే మానసిక వైద్యుడిగా తెలుసు. ఇంకొందరికి తెలుగు భాష సేవలో తరించే సాహిత్య పిపాసిగా తెలుసు. ఇంకొందరికి తెలుగు కమ్యూనిటీ కోసం పాటుపడే పరిపాలకుడిగా పరిచయం. ఇంకా ఆయనలో మనకు తెలియని కోణాలెన్నో. బహుముఖ ప్రజ్ఞకు అచ్చమైన చిరునామా అనదగ్గ జంపాల చౌదరి.. ప్రతిష్టాత్మక ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరుణాన స్ఫూర్తినిచ్చే ఆయన ప్రస్థానం 'నమస్తే ఆంధ్ర' పాఠకుల కోసం...**

## ఎన్నో పురస్కారాలు

**డా**క్టర్ చంపాల చౌదరి వివిధ రంగాల్లో ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. అందులో కొన్ని..

- 1995లో తానా ఎక్సలెన్స్ ఇన్ మెడిసిన్, కమ్యూనిటీ సర్వీస్ అవార్డు.
- 2001 తానా 13వ కాన్ఫరెన్స్ సందర్భంగా తానా కన్వీనర్ సేవా అవార్డు
- 2007లో తానా అధ్యక్షుడి తరపున సేవా పురస్కారం. అదే ఏడాది తానా కాన్ఫరెన్స్ సేవా అవార్డు.
- 1995లో ఇండో అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ తరపు సైంటిఫిక్ అచీవ్‌మెంట్ అవార్డు
- 1990లో నేషనల్ అసోసియేషన్ ఫర్ రీసర్చ్ ఇన్ షిజోఫ్రీనియా అండ్ డిప్రెషన్ తరపున యంగ్ ఇన్వెస్టిగేటర్ అవార్డు
- మియామి వాలీ ఏరియా తెలుగు సంఘం తరపున 2001లో కమ్యూనిటీ సేవా పురస్కారం
- 2004లో నార్త్ చికాగో వీఏ మెడికల్ సెంటర్ తరపున ప్రముఖ ఫిజీషియన్ అవార్డు
- 2012లో లావెల్ ఫెడరల్ హెల్త్ సెంటర్ ప్రముఖ ఫిజీషియన్ అవార్డు

పశ్చిమగోదావరి జిల్లా చాటపర్రులో జన్మించారు జంపాల చౌదరి. ప్రకాశం జిల్లాలో పాఠశాల చదువు పూర్తి చేశాక విజయవాడ లయోలా కళాశాలలో పీయూసీ చదివిన జంపాల.. గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. లోక్ సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ జంపాల సహాధ్యాయి కావడం విశేషం. ఎంబీబీఎస్ పూర్తి చేశాక చికాగో మెడికల్ స్కూల్లో సైకియాట్రీ, న్యూరో సైకాలజీల్లో శిక్షణ పొందారు. మూడు దశాబ్దాల కిందట చికాగోలో మొదలైంది ఆయన అమెరికా మజిలీ. ఈ మూడు దశాబ్దాల్లో జంపాల ఇంతింతై అన్నట్లు ఎదిగి.. ప్రస్తుతం తానా అధ్యక్షుడయ్యారు. 1981నుంచి తానా సభ్యునిగా, 1990 నుంచి జీవితసభ్యుడిగా ఉన్న డా. చౌదరి 1992నుంచి నిర్విరామంగా తానా సంస్థకు స్వచ్ఛందకార్యకర్తగా పని చేస్తున్నారు. మానసిక వైద్యునిగా, ఉపాధ్యాయుడిగా, పరిశోధనవేత్తగా, నిర్వాహకుడిగా తనకున్న అనుభవాన్ని తానా సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం ఉపయోగించారు. వృత్తిరీత్యా మానసిక వైద్యుడైన డాక్టర్ జంపాల చౌదరి, ప్రవృత్తిరీత్యా తెలుగు భాషకు, సంస్కృతికి గొప్ప అభిమాని. ఆయనకు తెలుగు సాహిత్యమంటే ప్రాణం. ఓవైపు సైకియాట్రిస్టుగా తన వద్దకు వచ్చే వారి మనసులు బాగు చేస్తూ.. మరోవైపు సాహిత్య పిపాసిగా తెలుగు భాషకు ఎనలేని సేవ చేశారాయన. కంప్యూటర్లలో తెలుగు వినియోగం మీద అమితాసక్తితో 90ల్లోనే ఈ దిశగా అడుగులు వేశారాయన. అమెరికాలో చిన్నారులకు తెలుగు నేర్పించడానికి దశాబ్దాలుగా తన వంతు కృషి చేస్తున్నారాయన.

వృత్తి పరంగానూ జంపాల బహుముఖ ప్రజ్ఞాశాలే. ఆయన వైద్యుడు మాత్రమే కాదు. ఉపాధ్యాయులు కూడా. వైద్య రంగంలో పరిపాలకుడిగా, శాస్త్రవేత్తగానూ తన ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రస్తుతం ఆయన రోజలిండ్ ఫ్రాంక్లిన్ యూనివర్శిటీ ఆఫ్ మెడిసిన్ అండ్ సైన్స్‌లో సైకియాట్రీ విభాగంలో వైస్ ఛైర్మన్‌గా, ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. లావెల్ ఫెడరల్ హెల్త్ కేర్ సెంటర్ (ఉత్తర చికాగో)కు హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్‌గానూ ఉన్నారు. 35 మిలియన్ల బడ్జెట్, 255 మంది వైద్య సిబ్బంది ఉన్న విభాగాన్ని జంపాల పర్యవేక్షిస్తున్నారు. క్రిస్టల్ లేక్‌లో జంపాల ప్రైవేటుగా ప్రాక్టీస్ కూడా చేస్తున్నారు.

### కొడుకుల పేర్లు వేమన, నన్నయ

జంపాల చౌదరికి తెలుగు భాషంటే ఎంత మక్కువో కొత్తగా చెప్పాల్సిన పని లేదు. ఆయనది సాహిత్యంతో విడదీయలేని అనుబంధం. ఐతే భాష గురించి ఊరికే ఉపన్యాసాలు దంచి.. నిజ జీవితంలో భిన్నంగా వ్యవహరించే రకం కాదాయన. తన కొడుకులిద్దరికీ పెట్టుకున్న పేర్లే అందుకు నిదర్శనం. ఆయన పెద్ద కొడుకు పేరు వేమన, చిన్న కొడుకు పేరు నన్నయ. ఇద్దరూ ఫిజీషియన్లుగా ఉన్నారు. ఎంత చక్కటి తెలుగు పేర్లు పెట్టారో... అవి ఎంత ప్రత్యేకంగా ఉన్నాయో చూశారా? తండ్రి తమకు పెట్టిన పేర్ల విషయంలో ఆయన కొడుకులు కూడా ఎంతో గర్విస్తారు, సంతోషిస్తారు. ఆయన తెలుగు భాషాభిమానం గురించి వేరే ఇంకేం చెప్పాలి. జంపాల భార్య పేరు అరుణ.

### సాహిత్య సేవలో జంపాల

ఇంటర్నెట్లో శోధన చేయగలిగే తెలుగు డిక్షనరీని తేవడంలో జంపాలది కీలక పాత్ర. పబ్లిక్ డొమైన్లో ప్రచురితమైన తొలి తెలుగు ఫాంట్ 'పోతన' రూపకల్పనలోనూ ఆయన తన వంతు పాత్ర పోషించారు. పర్సనల్ కంప్యూటర్లలో తెలుగు వినియోగంపై 1995లో చికాగో వేదికగా తొలి సెమినార్ నిర్వహించింది జంపాలే. తిరుపతిలో 2012లో జరిగిన తెలుగు ప్రపంచ మహా సభల సందర్భంగా గ్రామీణ ప్రజల రోజువారీ వ్యవహారాల్లో తెలుగు వినియోగంపై చర్చా వేదికను నిర్వహించారు. శ్రీకాకుళంలో ప్రసిద్ధి చెందిన 'కథానిలయం' కోసం విరాళాల సేకరణ చేపట్టారు. మియామి-వాలీ తెలుగు సంఘం, డెమాక్రటిక్ రిఫార్మ్స్ ఇన్ ఇండియా (ఎఫ్‌డీఆర్ఐ) వ్యవస్థాపకులు జంపాలే.

- అమెరికాకు కొత్తగా వచ్చే ప్రవాసాంధ్రులు, ఇక్కడ నివసిస్తున్నవారు సురక్షితంగా జీవించేందుకు ఎంతగానో తోడ్పడే టీమ్ స్క్వేర్ భద్రతా సూత్రాలు పేరుతో మోహన్ నన్నపనేనితో కలిసి మంచి పుస్తకం రాశారు జంపాల.
- డిసెంబరు 2012 తెలుగు వెలుగు పత్రికలో తెలుగుభాషకు తానా సేవపై వ్యాసం
- రెండు దశాబ్దాలు (2010) 1990-2009 మధ్య వచ్చిన ఉత్తమ కథల సంకలనం సహసంపాదకత్వం
- కథ నేపథ్యం (2012) సహ సంపాదకత్వం
- 1995, 2009 తానా సమావేశాల సావనీర్లకు ముఖ్య సంపాదకత్వం
- 1999 తానా సమావేశపు సావనీర్‌కు సహ సంపాదకత్వం
- ప్రతివారం పుస్తకం.నెట్ వెబ్‌సైటులో 2010నుంచి రాస్తున్న పుస్తక పరిచయాలు
- సినిమా సమీక్షలు
- ఈమాట వెబ్‌పత్రికలో వ్యాసాలు
- ఆంధ్రజ్యోతి సాహిత్య పేజీ 'వివిధ'లో అనేక వ్యాసాలు
- 2004-09 మధ్య 'తెలుగునాడి' వ్యవస్థాపక సంపాదకుడిగా ఉన్న జంపాల అందులో అనేక వ్యాసాలు రాశారు.
- తానా పత్రికకు 1993-04 మధ్య ఎడిటర్ గా వ్యవహరించారు. తానా సావనీర్లను వెలువరించారు.